క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



వృద్ధురాలికి నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ కార్యాలయం లో సోమవారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిం చారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో సేవలందించారు. 41 మందికి నేత్రపరీక్షలు చేసిన వైద్యులు వారిలో 18 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారిని ఆపరేషన్ల నిమిత్తం పుష్పగిరి కంటి ఆస్పత్రికి ఆ హాస్పిటల్ బస్సులోనే విజయనగరం తర లించారు. అలాగే కళ్లద్దాలు అవసరమైన వారికి వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు, వి.నారాయణమూర్తి, ఎం.కృష్ణమూర్తి, కె.నీలకంఠం, ఆర్.శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి భస్మాభిషేకం



బాబాకు భస్మాభిషేకం చేస్తున్న మహిళలు

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ –అరుకు రోడ్డులో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథునికి సోమవారం భస్మాభిషేకం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బాబాకు అభిషేకాలు చేశారు. పట్టణానికి చెం దిన భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు.

పేదరికం నిర్మూలనకే పథకాలు అమలు



పథకాలకు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

శృంగవరపుకోట: పేదరికం నిర్మూలన, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 22 పథకాలను అమలు చేస్తోందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డి సూర్యారావు తెలిపారు. మండలంలోని తిమిడి, వసి గ్రామాల్లో సోమవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ్ అన్నయోజన, ఉజ్వల యోజన, గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన తదితర 22 పథకాలను ప్రజలకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించారు. సూర్యారావు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రధాని అయిన తర్వాత దేశంలో చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను గ్రామీణులకు తెలియజేయడం కోసమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేస్తున్నామని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన క్యాలెండర్లను ఆవి ష్కరించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ లోకనాథ్ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



దత్తిరాజేరు: కేజీహెచ్‌లో వృద్ధుడు నర్సింగరావుకు పింఛన్ అందజేస్తున్న మరడాం గ్రామ వలంటీర్ వినయ్

దత్తిరాజేరు: మండలంలో మరడాం గ్రామానికి చెందిన వృద్ధుడు సలాది నర్సింగరావు అనారోగ్యంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు డిసెంబర్ నెల పింఛన్ డబ్బులను మరడాం గ్రామ వలంటీర్ వినయ్ సోమవారం కేజీహెచ్‌కు వెళ్లి అందజేశారు. వలంటీర్‌కు పింఛన్‌దారుడు నర్సింగ రావు కృతజ్ఞతలు తెలిపారు.

వేపాడ: మండలంలో ఆకులసీతంపేట గ్రామానికి చెందిన ఆవాల బంగారమ్మ విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో వెన్నుముక సమస్యకు చికిత్సతీసుకుంటున్నారు. ఆమెతో పా టు ఆమెకు సేవలందిస్తున్న అదే గ్రామానికి చెందిన గుమ్మాల బంగారమ్మకు డిసెంబర్ నెల పింఛన్ డబ్బులను వలంటీర్ కోలా నందిని సోమవారం విశాఖ వెళ్లి అంద జేశారు. వైస్ఎంపీపీ ఈశ్వరరావు వలంటీర్‌ను అభినందించారు.



వేపాడ: కేజీహెచ్‌లో ఆకులసీతంపేటకు చెందిన ఆవాల బంగారమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నందిని

హరహర మహాదేవ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ



వేపాడ: బొద్దాం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చీపురుపల్లి: కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో పట్టణంలోని శివాలయాలు హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి ఆలయాల వద్ద భక్తులు బా రులు తీరారు. ఆంజనేయపురంలోని మారుతీ హరిహర క్షేత్రం, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, కొత్తఅగ్రహారం, జి.అగ్రహారంలోని శివాలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు ఆలయాల ప్రాంగణంలో దీపారాధన చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

గుర్ల: మండలంలోని గుర్ల, కెల్ల, తెట్టంగి, తాతావారి కిట్టాలి, పెద్దబంటుపల్లి, నడుపూరు శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకం

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదనంలో పురోహితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించా రు. అలాగే మండలంలోని పలుగ్రామాల్లోని శివాయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు.

పోటెత్తిన భక్తులు

గజపతినగరం: స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఉదయం భక్తులు పోటెత్తారు. గజపతినగరంతో పాటు ఎం.వెంకటాపురం ,దావాలపేట,బూడిపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.పురిటిపెంట గ్రామంలోని సంతతోట శివాలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

అన్నసమారాధన

వేపాడ: మండలంలోని జాకేరు, బొద్దాం, బానాది గ్రామాల శివాలయాల వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. బానాది, బొద్దాం,వల్లంపూడి,నల్లబిల్లి, సోంపురం శివాలయాల్లో, కొండగుళ్లలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



గజపతినగరం : గజపతినగరం శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



చీపురుపల్లి: చీపురుపల్లిలో పూజలందుకుంటున్న ఉమానీలకంఠేశ్వరుడు



కొత్తవలస: తుమ్మికాపల్లి ఓం సదనంలో 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న పురోహితులు ఉమామహేశ్వరశర్మ



చీపురుపల్లి: చీపురుపల్లిలోని నీలకంఠేశ్వర దేవస్థానంలో నందీశ్వరుడు, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు



చీపురుపల్లి: చీపురుపల్లిలోని మారుతీ హరిహర క్షేత్రంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: గజపతినగరం శివాలయంలో బారులు తీరిన భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లిలోని ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో క్యూలో ఉన్న భక్తులు



గుర్ల: గుర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: బానాదిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి



సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమైన ఎంపీడీఓ కూర్మనాథ్‌పట్నాయక్

వేపాడ: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ సూచించారు. మండలంలోని పాటూరు గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు.ఈసందర్భంగా మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా టోర్నమెంట్‌ను ఈనెల15వ తేదీ నుంచి నిర్వహించనుందని చెప్పారు. 15 ఏళ్లు దాటిన మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్రికెట్, వాలీ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీలు ఉంటాయని, సచివాలయం పరిధిలో ఈ క్రీడల్లో పాల్గొనేందుకు 300 మంది రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం సిబ్బందితో గ్రామంలో పర్యటించి యువతకు అవగాహన కల్పించారు.

తీరిన ఇక్కట్లు

- రూ.2 కోట్లతో రాచగుమడాం–డి.గదబవలస గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం

మెరకముడిదాం: మండలంలోని రాచగుమడాం, తెర్లాం మండలంలోని డి.గదబవలస గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. రాచగుమడాం నుంచి డి.గదబవలస మీదుగా రాజాం–రామభద్రపురం ప్రధానరహదారి వరకు సుమారు 2.8 కిలో మీటర్ల మేర తారురోడ్డును రూ. 2 కోట్లతో నిర్మించారు. గతంలో ఈ మట్టి రోడ్డు పెద్ద గోతులతో అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడాల్సివచ్చేది. తారురోడ్డు నిర్మించాలని మండలంలోని రాచగుమడాం, బీమవరం, తెర్లాం మండలంలోని డి.గదబవలస గ్రామాలకు చెందిన పలువురు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావును కోరారు. వారు వెంటనే స్పందించి తారురోడ్డు నిర్మాణానికి రూ 2.కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో రోడ్డు పనులను ఇటీవలే ప్రారంభించి శరవేగంగా పూర్తి చేశారు. తారురోడ్డు నిర్మించడంతో ఆమార్గంలో ప్రయాణాలు సాగించే గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాచగుమడాం- డి.గదబవలసకు నిర్మించిన తారురోడ్డు

ప్రజాసంక్షేమమే ధ్యేయం



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురువేస్తున్న ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్, తదితరులు

జామి: పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తు న్నారని జెడ్పీటీసీ గొర్లె సరయు అన్నారు. మండలంలోని వి.ఆర్.పాలెం గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం మంగళవారం నిర్వ హించారు. ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాయకులు, ప్రజాప్రతి నిధులు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అర్హు లందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తు న్నామని చెప్పారు. అనంతరం గ్రామం లో స్థానిక, మండల నాయకులు, పెద్దల సమక్షంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఎగురవేశారు. వి.ఆర్.పాలెం,శాశనపల్లి సర్పంచ్‌లు చుక్క లక్ష్మి, వెంకటప్పారావు, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు తదిత రులు పాల్గొన్నారు.

మిల్లులకు ధాన్యం తరలించేందుకు చర్యలు

బొండపల్లి: వరి నూర్పులు పూర్తి చేసి కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తుపాను వల్ల కురిసే వర్షాలకు తడిసిపోకుండా లేకుండా మిల్లులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ డి.జి.ఎం.ఎస్.ప్రసాదరావు, ఏఓ పి.వి.మల్లికార్జున రావు తెలిపారు. మండలంలోని కనిమెరక, రాచకిండాం, బొండపల్లితో పాటు పలు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించారు. నూర్పులు చేసిన రైతులకు ధాన్యం తడిసిపోకుడా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అక్కడిక్కడే తేమశాతాన్ని పరీక్షించి నేరుగా మిల్లులకు ధాన్యం తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధాన్యం నిల్వచేయడానికి అవకాశం లేని చోట రైతు భరోసా కేంద్రాల్లోని గొడౌన్లకు తరలిస్తామని చెప్పారు. వారి వెంట ఏఈఓ సంతోష్ కుమార్, పౌరసరఫరాల శాఖ సాంకేతిక సహాయకురాలు అస్మిత, వీపీఏ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.



బొండపల్లి ఆర్బీకేలో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. వరిపంట కోసి చేను పూర్తిగా ఆరకుండానే కుప్పలు వేసేటప్పుడు గింజలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కుప్పలపై టార్పాలిన్‌లు కప్పాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బొండపల్లి: తుపాను నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమ త్తం చేయాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. తుపాను వల్ల గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈఓ–2 ఎ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అందించండి

వేపాడ: తుపాను నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ప్రజలు సంబంధిత సచివాలయ వీఆర్‌ఓలకు కాని తహసీల్దార్ కార్యాలయానికి కాని సమాచారం అందించాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రధానంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లోని వరి కుప్పలపై టార్పాలిన్‌లు కప్పాలని, గాలికి కుప్పలు ఎగిరిపోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ మీటర్లు పట్టుకోవడం చేయవద్దని,చెట్ల కింద ఉండవద్దని సూచించారు.

13న మండల సర్వసభ్యసమావేశం

మెంటాడ(గజపతినగరం రూరల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక ఈనెల 13వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సుదర్శన్ తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, మండల పరిషత్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

బీటీరోడ్ల నిర్మాణానికి రూ.6.35 కోట్లు మంజూరు

గుర్ల: మండలంలో రెండు గ్రామాల రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.35 కోట్లు మంజూరు చేసిందని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సోమవారం తెలిపారు. మండలంలోని దమరసింగి నుంచి నెల్లిమర్ల మండలం చనమల్లుపేట వరకు ఉన్న మట్టిరోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే ఆనందపురం నుంచి చింతలపేట మీదుగా నెల్లిమర్ల మండలం పూతికపేట వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా పాడైందని, ఈ రోడ్డును రూ.4.55 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. ఈపనులను ఈ నెలాఖరులోగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఘంటసాలకు ఘనంగా నివాళులు

విజయనగరం టౌన్: ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో సోమవారం గుమ్చీ వద్ద గల ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. సాయంత్రం ఆర్యసోమయాజుల కాశీపతిరావు భవనంలో ఉన్న ఘంటసాల పీఠంలో నిర్వహించిన ఘంటసాల సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చీపురుపల్లిరూరల్: మండలంలోని జి.ములగాం రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే) వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ సీహెచ్. రఘునాథ్‌తో కలిసి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, ఆపార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా నాయ కులు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యానికి అవసరమైన గోనె సంచులు, రవాణా చార్జీలను రైతులు ముందు భరిస్తే, ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. స్థానిక నాయకులు కరిమజ్జి శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఏఈ సత్యనారాయణ

మెంటాడ(గజపతినగరం రూరల్): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ ఏఈ సత్యనారాయణ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కాశంరాజుపేటలో ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 2,302 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు 1,523 నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు.కాశంరాజుపేట గ్రామానికి 54 ఇళ్లు మంజూరు చేశామని, వీటిలో 38 నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న మిగిలిన ఇళ్ల నిర్మాణాలను ఈనెలాఖరకు పూర్తి చేసేలా చూడాలని కాశంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావుకు సూచించారు. అనంతరం ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు.

బహుళ పంటల సాగుకు ప్రోత్సాహం



కాయగూరల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారి హేమసుందర్

బొండపల్లి: ఏటీఎం విధానంలో బహుళ కాయగూరల పంటలను సాగుచేయడం ద్వారా రైతులు ఏడాది పొడవునా ఆదాయం ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండ లంలోని కొవ్వాడపేట,వేపాడ తదితర గ్రామాల్లో ఏటీఎం విధానంలో రైతులు సాగుచేస్తున్న కాయ గూరల పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏటీఎం విధానంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులంతా పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. శాస్త్రవేత్త ఎం.కిశోర్, రైతు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.